

## బండారి మహిపాల్ కు శాలువాతో ఘనంగా సన్మానం

**మునిపల్లి అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుసరెడ్డిపల్లి గ్రామ యువకుడు బండారి మైపాల్ ఉన్నత చదువుల చదువుకొని స్వతహాగా వ్యాపారాన్ని ప్రారంభించి మరికొంతమంది యువకులకు ఉపాధి కల్పిస్తూ రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిలిం మేకర్ అవార్డు అందుకున్నాడు.

వివరాలు 2లో




# సంగారెడ్డి మెదక్

గురువారం 08 అక్టోబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:10


# మాందాపూర్‌లో ప్రభుత్వ భూమికి ముప్పు!



- సర్వే నం.98లో మట్టి మాయం..!
- వేలాది ట్రిప్పుల ఎర్రమట్టి 99 సర్వేనెంబర్ పట్టా భూములకు తరలింపు.
- ప్రభుత్వ భూమి నుంచే పట్టా భూమికి రహదారి..
- సంబంధిత రెవెన్యూ అధికారులు అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలి.

**కొండాపూర్**

**ప్రజా జ్యోతి**

మాందాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ భూముల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 98 నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే భారీగా ఎర్రమట్టి తరలించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదే ప్రభుత్వ భూమి నుంచి పట్టా భూమి సర్వే నంబర్ 99లోకి రహదారి ఏర్పాటు చేసినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమంగా వేలాది ట్రిప్పుల మట్టి తరలింపు..**

ప్రభుత్వ భూమి నుంచి పెద్ద ఎత్తున సర్వేనెంబర్ 99 పట్టా భూమి లోకిఎర్రమట్టి తరలిస్తున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మిగతా 2 లో














# అసైన్డ్ భూముల నుంచి అంకుర వెంచర్‌కు మట్టి తరలింపు!




- సర్వే నంబర్ 180 ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలింపు..
- వెంచర్ రహదారులు, ఇతర అవసరాలకు ప్రభుత్వ మట్టి వినియోగం...
- ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్కు సీసీ రోడ్డు ఏర్పాటు..
- సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

2 లో

# మాందాపూర్‌లో ప్రభుత్వ భూమికి ముప్పు!

మొదటిపేజీ తరువాయి

### ప్రభుత్వ భూమిలో రహదారి ఎలా?

పట్టా భూమిని కొనుగోలు చేసిన వ్యక్తులు తమ పొలానికి వెళ్లేందుకు ప్రభుత్వ భూమి నుంచే రహదారి ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వ భూమిని వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకునేందుకు ఎవరు అనుమతించారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

### అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

మాందాపూర్ జీపీఓ, సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ వ్యవహారం కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో జరుగుతున్న మట్టి తరలింపు, రహదారి నిర్మాణంపై అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

### గ్రామస్తుల డిమాండ్

సర్వే నం.98 ప్రభుత్వ భూమిని తక్షణమే సర్వే చేయాలి.మట్టి తరలింపుపై పూర్తిస్థాయి విచారణ జరపాలి.ప్రభుత్వ భూమి నుంచి వేసిన రహదారిపై చర్యలు తీసుకోవాలి.బాధ్యులు ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వ భూములు కాపాడాలి.. అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలి" అని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రజా జ్యోతి జాతీయ పత్రిక డిమాండ్:

ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. ప్రభుత్వ భూమికి నష్టం జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి.

**- కొండాపూర్ ప్రజా జ్యోతి రిపోర్టర్ శేఖర్..**

---

# బండారి మహిపాల్ కు శాలువాతో ఘనంగా సన్మానం

మొదటిపేజీ తరువాయి

రామచంద్రాపురం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పమ్మ బీరంగూడ లోని శ్రీ కన్వెన్షన్ హాల్లో బండారి మహిపాల్ కు శాలువాతో ఘనంగా సన్మానించారు. పుష్పమ్మ మాట్లాడుతూ యువత వృత్తి విద్యలో ఆధునిక పద్ధతులకు అనుగుణంగా తన నైపుణ్యతను మెరుగుపరచుకొని అన్ని రంగాల్లో రాణించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు, సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు గూడెపు మల్లయ్య కురుమ, సంగారెడ్డి జిల్లా బీసీ యువత అధ్యక్షుడు గోరుగంటి రమేష్, కురుమ సంఘం జిల్లా నాయకులు తాటిపల్లి అంబన్న కురుమ, గడ్డమీది సత్యనారాయణ కురుమ బండారి పాండు కురుమ తదితరులు పాల్గొన్నారు.

---

# అసైన్డ్ భూముల నుంచి అంకుర వెంచర్‌కు మట్టి తరలింపు!

మొదటిపేజీ తరువాయి








**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని సి.హెచ్. కొండాపూర్, మాందాపూర్ గ్రామాల శివార్లలో ఉన్న అంకుర వెంచర్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. వెంచర్ అభివృద్ధి పనుల కోసం సమీపంలోని అసైన్డ్ భూములతో పాటు సర్వే నంబర్ 180లోని ప్రభుత్వ భూమి నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.స్థానికుల ఆరోపణల ప్రకారం.. వెంచర్‌లో రహదారుల నిర్మాణం, లెవలింగ్ తదితర పనుల కోసం సర్వే నంబర్ 180లోని ప్రభుత్వ భూమి నుంచి మట్టిని తరలిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ భూమి నుంచి మట్టిని తరలించేందుకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? లేదా? అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రభుత్వ భూమితో వెంచర్‌కు రహదారి!

సర్వే నంబర్ 180కు సంబంధించిన ప్రభుత్వ భూమిని వినియోగించుకుని సీసీ రోడ్డు నిర్మించి వెంచర్‌లోకి రహదారి ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో రహదారి నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? భూమి స్వరూపాన్ని మార్చేందుకు ఎవరు అనుమతి ఇచ్చారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు.

### ప్రభుత్వ భూముల నుండి అంకురా వెంచర్ లోకి మట్టి తరలింపు!

ప్రభుత్వ భూమి నుంచి తరలించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మట్టిని వెంచర్‌లోని రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నారు ఈ అంశంపై కూడా అధికారులు పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సర్వే నంబర్ 180 భూమి హద్దులను గుర్తించి, అక్కడ జరిగిన మట్టి తవ్వకాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

### అధికారుల తనిఖీతో వాస్తవాలు వెలుగులోకి

అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రెవెన్యూ, పంచాయతీ, మైనింగ్ తదితర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తే మట్టి తరలింపు, రహదారి నిర్మాణం, ప్రభుత్వ భూమి వినియోగంపై వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు అంటున్నారు.

### సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి

సర్వే నంబర్ 180లోని ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలింపుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు, అక్రమంగా మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

**- కొండాపూర్ ప్రజా జ్యోతి రిపోర్టర్ శేఖర్**

# విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం..

## పీఎం శ్రీ పాఠశాలలో అల్పాహార కార్యక్రమం ప్రారంభం

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 07:**

తెలంగాణ ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ చేపట్టిన విద్యార్థుల అల్పాహార కార్యక్రమాన్ని వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో








బుధవారం ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పాఠశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం వల్ల వారి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పాఠశాలలో ఏకాగ్రతతో చదువుకునే సామర్థ్యం పెరుగుతుందని వారు తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండటంతో పాటు విద్యలో మంచి ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండం ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రావణ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధురి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తుక్కాపూర్ లో ఉచిత వైద్య శిబిరం.....

**కొల్చారం, అక్టోబర్ 07(ప్రజా జ్యోతి)**

మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో సింధు హాస్పిటల్ హైటెక్ సిటీ హైదరాబాద్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఆంజనేయులు ప్రారంభించారు. సింధు హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ పర్యవేక్షణలో గైకాలజిస్ట్, కార్డియాలజిస్ట్, బిపి, షుగర్ , గుండె, క్యాన్సర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం పరీక్ష చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఆంజనేయులు తో పాటు గ్రామంలోని సుమారు 134 మంది పరీక్షలు చేయించుకున్నారని మార్కెటింగ్ మేనేజర్ తెలిపారు. మెరుగైన చికిత్స అవసరమైన వారిని సింధు హాస్పిటల్ కు రిపేర్ చేశారు. సింధు ఆసుపత్రి చైర్మన్ బండి





పార్థసారథి రెడ్డి ఆధ్వర్యంలో తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సింధు ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఉచిత వైద్య శిబిరం విజయవంతం చేసినందుకు సింధు హాస్పిటల్ వైద్య సిబ్బందికి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆరె రవీందర్, పంచాయతీ వార్ సభ్యులు గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ తో పాటు పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

**రాయికోడ్ అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):**



ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మిషన్ భగీరథ కార్మికుడు కుస్నూర్ గ్రామానికి చెందిన విశ్వనాథ్ కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆర్థిక సహాయం అందించారు.మిషన్ భగీరథ సిబ్బంది తమ వంతుగా రూ.36 వేల నగదును సేకరించి విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు మాట్లాడుతూ.. విశ్వనాథ్ మృతి తమను తీవ్రంగా కలచివేసిందని,ఆయన కుటుంబానికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

## కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటాం

### - మాజీ మంత్రి హరీష్ రావు భరోసా

**జహీరాబాద్, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి న్యూస్)**



నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ మంత్రి హరీష్ రావు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జహీరాబాద్ శాసన సభ్యులు శ్రీ కొనింటి మాణిక్ రావు, మల్గి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతీ. మల్గి గ్రామ సభలో యువకులపై జరిగిన దౌర్జన్యం పై మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు. కార్యకర్తలకు ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యలను వివరించారు. కార్యకర్తలు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా వారికి పార్టీ అండగా ఉంటుందని, న్యాయ పరంగా అవసర మైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హరీష్ రావు హామీ ఇచ్చారు. కార్యకర్తలే పార్టీకి బలం.. వారి కోసం ఎల్లప్పుడూ ముందుంటాం అని అన్నారు.

# హుండీ దొంగతనం కేసు ఛేదించిన సదాశివపేట పోలీసులు

## సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో

## నిందితుడి అరెస్ట్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో ఇటీవల జరిగిన ఆలయ హుండీ దొంగతనం కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ నెల 3వ తేదీన సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో ఉన్న భవాని మాత ఆలయంలోకి పగటిపూట చొరబడిన ఓ దుండగుడు హుండీని పగలగొట్టి నగదును అపహరించాడు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు సదాశివపేట పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సీఐ డి.వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజ్ మరియు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని మల్కాపూర్ గ్రామానికి చెందిన మల్లేపల్లి శ్రీనివాస్ (29)గా పోలీసులు గుర్తించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి దొంగిలించిన నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో శ్రీనివాస్ మద్యానికి, ఇతర చెడు వ్యసనాలకు బానిసై జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. గతంలో కూడా సదాశివపేట పరిధిలోని రెండు దేవాలయాల్లో హుండీలను దొంగిలించిన కేసుల్లో ఇతడు జైలుకు వెళ్లొచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ డి.వెంకటేష్ తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో వేగంగా కేసును ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.




# ఆర్అండ్‌బీ అధికారులు.. ఈ గుంతలు పూడ్చేది ఎప్పుడు....?

## - చిన్న ఘనపూర్ నుంచి రంగంపేట, సంగాయిపేట, పోతాంశెట్టిపల్లి చౌరస్తా వరకు అధ్వానంగా రహదారి....

## - ప్రయాణికులు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు..

## వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్....

**కొల్చారం, అక్టోబర్ 07(ప్రజా జ్యోతి)**



మెదక్‌సంగారెడ్డి ప్రధాన రహదారి రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్చారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్ గ్రామ శివారు నుంచి రంగంపేట, సంగాయిపేట, పోతాంశెట్టిపల్లి చౌరస్తా వరకు రహదారి అనేక చోట్ల గుంతలు గుంతలుగా మారడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాలను సురక్షితంగా నడపడం కష్టంగా మారిందని వాహన చోదకులు చెబుతున్నారు. గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు పక్కకు మళ్లడం, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకోవడం ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతల కారణంగా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో అవి కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని చెబుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని పేర్కొన్నారు. రహదారి గుంతలమయంగా మారడంతో వాహనాల వేగం తగ్గిపోవడంతో పాటు ప్రయాణ సమయం కూడా పెరుగుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. గుంతల కారణంగా వాహనాల టైర్లు, ఇతర విడిభాగాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ రహదారిపై ప్రయాణించే వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. చిన్న ఘనపూర్ గ్రామ శివారు నుంచి రంగంపేట, సంగాయిపేట, పోతాంశెట్టిపల్లి చౌరస్తా వరకు ఉన్న రహదారిని సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. కేవలం తాత్కాలికంగా గుంతలను పూడ్చడం కాకుండా రహదారిని పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరమైన చోట నాణ్యమైన మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ప్రధాన రహదారి కావడంతో అధికారులు ఇకనైనా స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. “ఆర్అండ్‌బీ అధికారులు.. ఈ గుంతలు పూడ్చేది ఎప్పుడు?” అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.



# ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి..

## - డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు....

**కొల్చారం,అక్టోబర్07(ప్రజా జ్యోతి)**



మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను మరింత వేగవంతం చేసి, ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం కొల్చారం మండల కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వి.బి.–జీ రామ్‌జీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఉపాధి హామీ పనుల పురోగతి, కూలీల హాజరు, చేపట్టిన పనులు, పూర్తయిన పనులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పనులను మరింత వేగవంతం చేసి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి కోరుకునే ప్రతి కూలీకి పనులు కల్పించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జలసిరికి సంబంధించిన పనుల పురోగతిపై కూడా సమీక్షించారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వాటి ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని డీఆర్‌డీఓ సూచించారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు నిరంతరం పనులు అందేలా చర్యలు తీసుకోవాలని, పనుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో చేపట్టే పనులు ప్రజలకు ఉపయోగపడేలా ప్రాధాన్యత క్రమంలో పనులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వి.బి.–జీ రామ్‌జీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# వడ్డేపల్లి సబ్స్టేషన్ ముందర కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం

**సబ్‌స్టేషన్ ముట్టడి**

హత్నూర మండల పరిధిలో ని వడ్డేపల్లి సబస్టేషన్ కేంద్రంలో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలపై చింతల్చెరువు కోణంపేట రైతులు బుధవారం నాడు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ సబ్ స్టేషన్ ముందు నిరసన తెలిపారు.వ్యవసాయ మోటార్లకు తరచూ లోవోల్టేజీ రావడంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరందక ఎండిపోతూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.సమాచారం అందుకున్న విద్యుత్ అధికారి ఏ డి శ్రీనివాసు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి సబ్‌స్టేషన్‌కు చేరుకుని రైతులకు నచ్చజెప్పి పంటలు కోసే వరకు కరెంటు కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పారు.దీంతో రైతులు ఆందోళన విరమించారు.ఈ ఆందోళనలలో కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ఇంచార్జి రాఘవులు విద్యుత్ లైన్మెన్ జగదీష్ విద్యుత్ సిబ్బంది పోలీస్ సిబ్బంది రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో వినిపించని గొంతులను వెలికితీయాలి

## - ఆర్కైవ్‌లలో స్త్రీవాదుల అన్వేషణపై ఊర్వశి బుటాలియా





**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

చరిత్రను కేవలం అధికారిక రికార్డుల ఆధారంగా కాకుండా, అణగారిన వర్గాలు, మహిళల అనుభవాల కోణంలోనూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, ప్రచురణకర్త, కార్యకర్త, జుబాన్ బుక్స్ సహ వ్యవస్థాపకురాలు ఊర్వశి బుటాలియా అన్నారు. హైదరాబాద్‌లోని గీతం విశ్వవిద్యాలయంలో బుధవారం 'ఆర్కైవ్ అన్వేషణలో స్త్రీవాదులు' అంశంపై ఆమె ప్రసంగించారు గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్‌ఎస్)లోని ఆంగ్లం, ఇతర భాషల విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.సాంప్రదాయ చారిత్రక రికార్డుల్లో మహిళలు, అణగారిన వర్గాల గొంతులు, అనుభవాలు తరచుగా కనుమరుగవుతున్నాయని బుటాలియా పేర్కొన్నారు. 'ఎవరి చరిత్రను భద్రపరుస్తున్నాం? ఎవరి గొంతులు వినిపించడం లేదు?' అనే ప్రశ్నలతో చరిత్రను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ ఆధారిత, ప్రత్యామ్నాయ ఆర్కైవ్‌లు అణగారిన వర్గాల చరిత్రలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.భారతదేశవ్యాప్తంగా స్త్రీవాద ఉద్యమాల చరిత్రను నమోదు చేసేందుకు జుబాన్ చేపడుతున్న కార్యక్రమాలను ఆమె వివరించారు. ఇందులో భాగంగా సుమారు 1,500 పోస్టర్ లు, 120 మౌఖిక చరిత్ర ఇంటర్వ్యూలను సేకరించి, డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. ఆర్కైవ్‌ల పరిరక్షణ, మెటాడేటా రూపకల్పన, కాపీరైట్, సమ్మతి వంటి అంశాల్లో ఎదురయ్యే సవాళ్లను కూడా వివరించారు. చారిత్రక సమాచారాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంలో డిజిటల్ ఆర్కైవ్‌లు కీలకమన్నారు.అనంతరం బుటాలియా డిజిటల్ ఆర్కైవ్‌ను విద్యార్థులకు ప్రదర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. తొలుత జీఎస్‌హెచ్‌ఎస్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ డాక్టర్ శామ్యూల్ థరు అతిథిని స్వాగతించారు. విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గల్లీ రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు..

## - త్వరలో సీసీ రోడ్ల నిర్మాణం సర్పంచ్ కోడి గంగారాం

**కల్హేర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**

కల్హేర్ మండలంలోని గ్రామాల్లో గుంతలమయమైన చిన్న గల్లీ రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నట్లు సర్పంచ్ కోడి గంగారం తెలిపారు. ఉపసర్పంచ్. పి మహేష్ ఆధ్వర్యంలో ఆయా గల్లీల్లో ఏర్పడిన గుంతలను ఎర్రమట్టితో పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.త్వరలో ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో గ్రామంలోని చిన్న గల్లీ రోడ్లకు సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ వంతుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు హరితవనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సోక్‌పిట్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణానికి అనువైన మార్గాలను గుర్తించి పనులు చేపడతామని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ కోడి గంగారం కోరారు.





# త్రీ-ఫేజ్ కోసంరైతుల ఆందోళన

## లో-వోల్టేజ్‌తో రైతుల గగ్గోలు. విద్యుత్ కోతలు.. లో-వోల్టేజ్ బాధలు

## విద్యుత్ సమస్యలపై రైతుల నిరసన

**కల్హేర్ , అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**

సకాలంలో త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరా చేయడంతో పాటు తరచూ లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తూ కల్హేర్ మండలం రాపర్తి గ్రామానికి చెందిన రైతులు నిరసనకు దిగారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోతున్నాయని, పంటలకు అవసరమైన విద్యుత్ అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సబ్‌స్టేషన్ వద్ద, రహదారులపై రైతులు ధర్నాలు, నిరసనలు చేపట్టారు. విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి త్రీ-ఫేజ్ విద్యుత్‌ను సకాలంలో అందించాలని అధికారులను కోరారు.మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో రైతు సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

## ఆపన్నులకు అండగా వేద జనని వేదిక స్మార్త పీఠం

### నిరుపేద కుటుంబానికి నెలవారీ

### నిత్యావసర సరుకుల పంపిణీ

**కల్హేర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని మార్డి గ్రామంలో శ్రీ వేద జనని వేదిక స్మార్త పీఠం (మెల్బోర్న్‌హైదరాబాద్) ఆధ్వర్యంలో కీర్తిశేషులు వెంకటి సంతానం భానుప్రియకు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. జడ్పీహెచ్ఎస్ మార్డి పాఠశాల ఉపాధ్యాయుల చేతుల మీదుగా ఈ సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సమాజ సేవకుడు హనుమడ్ల సెట్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ నిత్యావసర వస్తువులు అందిస్తున్న శ్రీ వేద జనని వేదిక స్మార్త పీఠం దాతలకు, చంద్రశేఖర్ ఆచార్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో భాగంగా చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.
- అశ్వత్థామ రెడ్డికి అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలిలి
- జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి
- యూత్ కాంగ్రెస్ జహీరాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు పట్లోళ్ళ.నాగిరెడ్డి

**జహీరాబాద్,అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి న్యూస్)**





ఆర్టీసీ కార్మికుల ఎన్నికల ప్రచారంలో భాగంగా జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ నుండి బరిలో ఉన్న అశ్వత్థామ రెడ్డి గారికి మద్దతుగా జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాబోయే ఆర్టీసీ కార్మికుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అశ్వత్థామ రెడ్డిని భారీ మెజారిటీతో గెలుపించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ యం.పి.పి గుండా రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, సర్పంచ్ లు నరేష్, సోమప్ప, రమేష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి మల్లికార్జున్, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జగన్మోహన్, దిలీప్ కుమార్, ఇమామ్ పటేల్, నర్సింహారెడ్డి, సురేష్, నర్సింహులు మరియు ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీఏ సాధనే లక్ష్యం

- -జిన్నారంలో ముదిరాజుల భారీ ర్యాలీ.. -హక్కుల కోసం ఐక్య గళం
- -రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి..
- - మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి





**జిన్నారం(ప్రజాజ్యోతి)**

ముదిరాజుల హక్కులు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం జిన్నారంలో ముదిరాజులు భారీ ర్యాలీ నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీకి వివిధ ప్రాంతాల నుంచి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముదిరాజులను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చి, బీసీఏ రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు.

**బీసీఏలో చేర్చాలి**

ముదిరాజుల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బీసీఏ కేటగిరీలోకి మార్చాలని నాయకులు డిమాండ్ చేశారు. బీసీఏలో చేర్చడం ద్వారా విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తమ సామాజికవర్గానికి న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. చెరువులు, కుంటలు, జల వనరులపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఉపాధి, సంక్షేమం, భద్రత కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకార కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.

**జనాభాకు అనుగుణంగా రాజకీయ వాటా ఇవ్వాలి**

ముదిరాజుల జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలతో పాటు నామినేటెడ్ పదవుల్లోనూ సముచిత అవకాశాలు ఇవ్వాలని కోరారు. అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కూడా ముదిరాజులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ప్రభుత్వంలో మంత్రి పదవులతో పాటు కీలక బాధ్యతల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని పేర్కొన్నారు.




**ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి**

ముదిరాజుల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నాయకులు కోరారు. విద్యార్థులకు విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి, మత్స్యకారులకు జీవనోపాధి, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీఏ జేఏసీ చైర్మన్ డాక్టర్ గుల్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, అడ్వైజర్ మోర రవికాంత్ ముదిరాజ్, టీఎంపీఎస్ నాయకులు, వివిధ ముదిరాజ్ సంఘాల నాయకులు, కౌన్సిలర్ లు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, కుల సంఘాల అధ్యక్షులు, యువత, ముదిరాజ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదే ఆధారమా..?

## అక్రమ ఇసుక రవాణాపై ముందస్తు నిఘా ఏది?

**- హల్దీవాగులో ఇసుక దందా..**

**- అక్రమ దారులు తొలగించినా.. అసలు ఇసుక రవాణాపై పూర్తిస్థాయి నిఘా ఎక్కడ?**

**- హల్దీవాగులో ఇసుక రవాణాపై ఉన్నతాధికారుల నజర్ అవసరం..**

**- ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటున్న స్థానికులు**

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 07:**
వెల్దుర్తి మండల కేంద్రం సమీపంలోని హల్దీవాగులో ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. వాగులోకి వాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అక్రమ మార్గాన్ని జేసీబీ సహాయంతో తొలగించి, ఇసుక తరలింపునకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. అయితే ఈ చర్యలు కేవలం తూతూమంత్రంగానే కాకుండా, అక్రమ ఇసుక రవాణా వెనుక ఉన్న అసలు



వ్యవహారంపై అధికారులు లోతైన విచారణ చేపట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.హల్దీవాగు నుంచి ఇసుకను తరలించేందుకు కొందరు పట్టా భూముల మీదుగా ప్రత్యేకంగా దారులు ఏర్పాటు చేస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఒక్కో ట్రాక్టర్ నుంచి నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా రావడంతో రెవెన్యూ అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు.ఫిర్యాదుల నేపథ్యంలో స్థానిక రెవెన్యూ అధికారి బుధవారం ఇసుక తరలింపు జరుగుతున్నట్లు ఆరోపణలు వచ్చిన ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వాగులోకి వాహనాలు ప్రవేశించకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన మార్గాన్ని జేసీబీతో తవ్వించి గోతిని ఏర్పాటు చేయించారు.అయితే అక్రమ దారిని ఒక్కసారి తొలగించడం మాత్రమే సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని, మళ్లీ అదే ప్రాంతంలో మార్గాలు ఏర్పాటు చేసి ఇసుక తరలింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? ఎవరి సహకారంతో ఈ వ్యవహారం సాగుతోంది? ట్రాక్టర్ల ద్వారా నిజంగా నగదు వసూలు చేస్తున్నారా? ఇసుకను ఎక్కడికి తరలిస్తున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

### స్థానిక అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

ఇంతకాలంగా హల్దీవాగులో ఇసుక రవాణాపై ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నప్పటికీ స్థానిక స్థాయిలో పర్యవేక్షణ ఎందుకు పూర్తిస్థాయిలో జరగలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమస్య వెలుగులోకి వచ్చిన తర్వాత మాత్రమే చర్యలు చేపట్టడం,అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాలపై నిరంతర నిఘా పెట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

### స్థానిక అధికారుల పర్యవేక్షణ కేవలం తూతూమంత్రంగా మారిందా?

స్థానిక అధికారుల పర్యవేక్షణ కేవలం తూతూమంత్రంగా మారిందా అనే అనుమానాలు కూడా



వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది ఉన్నతాధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది.

### ఇళ్ల నిర్మాణం పేరుతో ఇసుక తరలింపు?

వెల్దుర్తి మండల కేంద్రానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరైన నేపథ్యంలో నిర్మాణ అవసరాల పేరుతో ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి నిల్వ చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది.ఇసుక కొరతను ఆసరాగా చేసుకుని రవాణా, కూలీ తదితర ఖర్చుల పేరుతో ట్రాక్టర్‌కు అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

### అక్రమ దారులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు

పట్టా భూముల నుంచి వాగులోకి అక్రమంగా రహదారులు ఏర్పాటు చేసి ఇసుక రవాణాకు సహకరిస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించే వాహనాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇసుక రవాణాకు మార్గాలు ఏర్పాటు చేస్తే సంబంధిత భూముల వివరాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

### ఉన్నతాధికారులు రంగంలోకి దిగాలి

హల్దీవాగులో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ ఇసుక రవాణాపై మండల స్థాయి చర్యలకే పరిమితం కాకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.అక్రమ ఇసుక రవాణాకు ఎవరు సహకరిస్తున్నారు? అక్రమ దారులు ఎప్పటి నుంచి వినియోగంలో ఉన్నాయి? ఎన్ని వాహనాలు ఇసుక తరలిస్తున్నాయి? ఇసుక ఎక్కడికి తరలిస్తున్నారు? అక్రమంగా ఇసుక నిల్వలు ఉన్నాయా? ట్రాక్టర్‌కు నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు.

### స్థానిక అధికారుల పర్యవేక్షణలో ఏమైనా లోపాలు ఉన్నాయా?

అలాగే స్థానిక అధికారుల పర్యవేక్షణలో ఏమైనా లోపాలు ఉన్నాయా,ఫిర్యాదులు వచ్చినప్పటికీ సకాలంలో ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశాన్ని కూడా ఉన్నతాధికారులు పరిశీలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.హల్దీవాగు సహజ వనరుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా అక్రమ ఇసుక



రవాణాకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టేందుకు ఉన్నతాధికారులు తక్షణమే రంగంలోకి దిగి, సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు

## - అర్హతలు, నిబంధనలు పాటించే స్కానింగ్ కేంద్రాలకే రిజిస్ట్రేషన్, రెన్యువల్

## - స్కానింగ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి - అడిషనల్ కలెక్టర్ పాండు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:-**

గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించే పీసీపీఎన్డీటీ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అడిషనల్ కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే స్కానింగ్ కేంద్రాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, రికార్డుల నిర్వహణ, చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, జిల్లాలో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ సమయంలో అన్ని నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హతలు, అవసరమైన అనుమతులు కలిగి, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడుతున్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని అధికారులను ఆదేశించారు.ఏ స్కానింగ్ కేంద్రంలోనైనా గర్భిణీ స్త్రీలకు నిర్వహించే స్కానింగ్ ద్వారా పుట్టబోయే శిశువు ఆడా, మగా అనే లింగ నిర్ధారణ చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడినట్లు గుర్తిస్తే పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే స్కానింగ్ కేంద్రాల అనుమతులను రద్దు చేయడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో సీజ్ చేసే చర్యలు కూడా చేపట్టాలని స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని



స్కానింగ్ కేంద్రాల్లో స్కానింగ్‌కు సంబంధించిన రికార్డులు, రిపోర్టులు, రిజిస్టర్లు తదితరాలను నిబంధనల ప్రకారం సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను ప్రోత్సహించే వారితో పాటు, వాటికి సహకరించే వారు కూడా చట్ట ప్రకారం శిక్షార్హులేనని ఆయన తెలిపారు. పీసీపీఎన్డీటీ చట్టంలోని నిబంధనలు, లింగ నిర్ధారణ పరీక్షల వల్ల కలిగే అనర్థాలు, భ్రూణ హత్యల నివారణపై జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు.



లింగ నిర్ధారణ పరీక్షల నివారణ, పీసీపీఎన్డీటీ చట్టం సమర్థవంతమైన అమలుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ తెలిపారు.

**ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు సూచనలు చేసారు.**

ఈ సమావేశంలో డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ లలితాదేవి, డీసీహెచ్ఎస్ శ్రీధర్ కుమార్ , జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు డా. లక్ష్మి శైలజ, డా. శశికల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అడ్వకేట్ శైలజ ,డా. రాజు గౌడ్,సంబంధిత వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్ బడులకు కార్పొరేట్ కళ

## - రూ.74.50 కోట్లతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలకు శంకుస్థాపన

## - కార్పొరేట్ స్థాయి వసతులతో నాణ్యమైన విద్యే లక్ష్యం:

## - ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**అమీన్ పూర్(ప్రజాజ్యోతి)**



పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి, సుల్తాన్‌పూర్‌లో ఎకరం 10 గుంటల విస్తీర్ణంలో రూ. 49.50 కోట్లతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాల నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలోని 9 డివిజన్ ల పరిధిలో రూ. 364 కోట్లతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రారంభమైన పనులను వేగంగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.కొత్త పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, ఆధునిక మౌలిక వసతులు, అవసరమైన విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు నాణ్యమైన బోధనకు అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటైన విద్యా వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజాప్రతినిధులు రాజు, భాస్కర్‌గౌడ్, అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ సుధాకర్, డీఈలు రాజు, వెంకటరమణ, ఏఈలు వరుణ్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# రీసర్వే రికార్డులపై రైతుల దృష్టి సారించాలి

**వట్టిపల్లి అక్టోబర్, 7 ప్రజా జ్యోతి**

వట్పల్లి మండలం షాహెద్నగర్ (ఘట్పల్లి) గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన పునఃసర్వే (రీ-సర్వే)కు సంబంధించిన భూ రికార్డులను గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రచురిం చినట్లు తహసీల్దార్ జంగేశ్వర్ తెలిపారు. రీసర్వే ద్వారా రూపొందిం చిన రికార్డులను భూ పట్టాదారులు, రైతులు పరిశీలించేం దుకు ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రీసర్వేలో రూపొందించిన భూ రికార్డుల్లో తమ భూమికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, పట్టాదారు వివరాలు, హక్కులకు సంబంధించిన అంశాలను రైతులు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని తహసీ ల్దార్ సూచించారు. రికార్డుల్లో ఏవైనా తప్పులు, పొరపాట్లు లేదా హక్కులకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే అధికా రుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజులలోపు సంబంధిత క్లెయిమ్లు, అభ్యంతరాలను సమర్పించాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా అభ్యంత రాలను తెలియ జేస్తే వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు తమ భూ ములకు సంబం ధించిన రీసర్వే రికార్డులను తప్పనిసరిగా పరి శీలించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా అధి కారులకు తెలియజేయాలని తహసీల్దార్ జంగేశ్వర్ కోరారు.




# కుల రహిత సమాజం కోసం పోరాడుదాం..

## – కుల వివక్ష, దోపిడీ, అంతరాలు లేని సమాజం కోసం ఉద్యమిద్దాం..
## – మహనీయులు పూలే, అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి..
## – కేవీపీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

కుల వివక్ష, అంటరానితనం, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) మాజీ మండల నాయకుడు కే. రాజయ్య పిలుపునిచ్చారు. కేవీపీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొండాపూర్ మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం సమీపంలో కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే. రాజయ్య మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తమ జీవితాంతం కుల వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో ఇంకా కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కుల వివక్ష, సామాజిక అంతరాలు లేని సమాజం కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలతో 1998 అక్టోబర్ 2న చారిత్రక అవసరంగా కేవీపీఎస్ ఏర్పడిందని తెలిపారు. గత 28 సంవత్సరాలుగా అనేక సామాజిక సమస్యలపై కేవీపీఎస్ పోరాటాలు నిర్వహించిందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ కమిషన్, దళితవాడల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం, దళితులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, స్మశాన వాటికల ఏర్పాటు, కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలు వంటి అంశాలపై ఉద్యమాలు నిర్వహించిందని వివరించారు. రాష్ట్రంలో జరిగిన కుల దురహంకార హత్యల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి కేవీపీఎస్ పోరాటాలు చేసిందన్నారు. ఎక్కడ కుల వివక్ష, అంటరానితనం, అవమానాలు చోటుచేసుకున్నా బాధితుల పక్షాన నిలిచి, సామాజిక ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాలు



నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తూ, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కుల వివక్ష, సామాజిక అణచివేత, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా విశాల ప్రజా ఉద్యమాలను నిర్మించాలని, అందరికీ విద్య, అందరికీ వైద్యం, సమాన హక్కులు కల్పించే కుల రహిత సమాజం కోసం పోరాడాలని రాజయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్ అలీ, డీవైఎఫ్ఐ నాయకులు, మొయిన్భాష, సూజ్జి నాయక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

## – గడీల శ్రీకాంత్ గౌడ్ -మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన

**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్‌రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన బాధితులను పటాన్‌చెరు మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ పరామర్శించారు. అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను వైద్యులు, బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న శ్రీకాంత్ గౌడ్.. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అవసరమైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఆయన.. ప్రమాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సమయంలో అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని శ్రీకాంత్ గౌడ్ భరోసా ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం, కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.





# రెండు విడతల డీఏ మంజూరు

## - ప్రభుత్వ నిర్ణయంపై టీఎస్‌యూటీఎఫ్ హర్షం

**నారాయణఖేడ్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రెండు విడతల కరువు భత్యం (డీఏ) పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కంబాపురం అశోక్, ప్రధాన కార్యదర్శి బి. సాయిలు హర్షం వ్యక్తం చేశారు. టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలు చేపట్టిన పోరాట ఫలితంగానే రెండు డీఏలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల సంఖ్య 128, తేదీ 6 అక్టోబర్ 2026 ప్రకారం 01 జనవరి 2024 నుంచి డీఏను ప్రాథమిక వేతనంలో 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచిందని తెలిపారు. అలాగే ఉత్తర్వుల సంఖ్య 130, తేదీ 6 అక్టోబర్ 2026 ప్రకారం 01 జులై 2024 నుంచి డీఏను 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.పెంచిన డీఏను అక్టోబర్ 2026 వేతనంతో కలిపి నవంబర్ 1, 2026న ఉద్యోగులకు చెల్లించనున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) కింద ఉన్న ఉద్యోగులకు డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నారని, సీపీఎస్ ఉద్యోగులకు సమాన వాయిదాల్లో చెల్లించనున్నట్లు వెల్లడించారు. రెండు విడతల డీఏ మంజూరుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల కావడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన వారు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి ఇది ఫలితమని పేర్కొన్నారు. అయితే జూలై 2023 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఇతర పెండింగ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.





# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:-**





రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టి, ప్రమాద మరణాలను తగ్గించాలని రాష్ట్ర డీజీపీ సి వి ఆనంద్, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబరితి, సూచించారు.రోడ్డు భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ సమీక్ష నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ, రవాణా శాఖ కమిషనర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఆయా జిల్లాల వారీగా సమగ్ర రోడ్డు భద్రతా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాల అనంతరం తక్షణ వైద్య సేవలు అందేలా పోలీస్, ఆరోగ్య, 108 సేవల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు.రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, జిల్లా వారీగా చేపట్టిన చర్యలు, పురోగతి, తదుపరి కార్యాచరణతో కూడిన జిల్లా వారీ నివేదికను సిద్ధం చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంగారెడ్డి కలెక్టరేట్ వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, డి ఎం ఎం హెచ్ ఓ, ఆర్ అండ్ బి, ఎన్ హెచ్ ఎ ఐ, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.